


# కరపత్రం

SINCE 2014

శనివారం ఏప్రిల్ 26 2025 సంపుటి :0 సంచిక :194 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4




## ఫోన్ ట్యాపింగ్ కేసు..

### ప్రభాకర్‌రావు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ

తెలంగాణలో తీవ్ర చర్చనీయాంశమైన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఐజీ ప్రభాకర్‌రావు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది.



## తెలంగాణలో ఉన్న పాకిస్తానీలు.. వెంటనే పాకిస్తాన్ వెళ్లిపోవాలి: డీజీపీ జితేందర్ ఆదేశాలు






## వక్ఫ్ సవరణ చట్టంపై పిల్.. సుప్రీంలో తేలాక చూద్దామన్న హైకోర్టు




# పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ

హైదరాబాద్: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనలో సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, భారత్ సమ్మిట్‌కు వచ్చిన విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో నగరవాసులు పాల్గొని పహల్గాం మృతులకు సంతాపం తెలిపారు.

**మరోసారి పాకిస్థాన్‌ను ఓడించాలి: రేవంత్**

మొత్తం 140 కోట్ల మంది ప్రజలు ఏకమై ఉగ్రవాదంపై పోరాడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. భారత్‌లోకి చొచ్చుకొచ్చి.. పాక్ ఉగ్రవాదులు దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. "ఉగ్రవాదంపై పోరులో 140 కోట్ల మంది ప్రజలు ప్రధాని వెంట ఉంటారు. ఈ విషయంలో మోదీకి మద్దతు తెలుపుతున్నా. బాధిత కుటుంబాలకు అండగా ఉండాల్సిన అవసరం ఉంది. 1971లో పాకిస్థాన్‌కు ఇందిరాగాంధీ గట్టిగా బుద్ధి చెప్పారు. ఆనాడు ఇందిరాగాంధీని దుర్గామాతతో వాజ్‌పేయీ పోల్చారు. మరోసారి పాకిస్థాన్‌ను ఓడించాలి. పీవోకేను భారత్‌లో కలపాలి. ఇందిరాగాంధీని గుర్తుకుతెచ్చుకొని పాక్‌కు మరోసారి గట్టిగా బుద్ధి చెప్పాలి. అభివృద్ధి పథంలో నడుస్తున్న భారత్‌పై ఉగ్రదాడి జరిగింది. పార్టీలు, సిద్ధాంతాలకు అతీతంగా ఉగ్రవాదంపై పోరు జరపాలి. అందరం ఏకమై తీవ్రవాదాన్ని అంతం చేసి ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలి. ఉగ్రదాడికి పాల్పడిన వారికి కఠినంగా శిక్షించాలి" అని అన్నారు.



## హెచ్ఐసీసీలో 'భారత్ సమ్మిట్'.. విదేశీ ప్రతినిధులకు ఘనస్వాగతం




## శుభం ద్వివేది కుటుంబానికి యోగి పరామర్శ




## దేశాన్ని చీల్చడమే ఉగ్రవాదుల లక్ష్యం

ఉగ్రవాదం తుదముట్టించేందుకు సంఘటిత పోరాటం

శ్రీనగర్‌లో మీడియాతో రాహుల్




## జేబులు నింపుకునేందుకే కాళేశ్వరం

వచ్చే కేబినెట్‌లో ఎన్‌డీఎస్‌ఏపై చర్చించి చర్యలు

బీఆర్ఎస్ రైతులకు క్షమాపణలు చెప్పాలి

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి






## మంత్రి పొంగులేటి పేరిట వసూళ్లు.. ఇద్దరు అరెస్టు

వరంగల్: తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పీఏలుగా చెప్పుకొంటూ వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారిని ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బుస్సా వెంకటరెడ్డి, మచ్చ సురేశ్‌లుగా గుర్తించారు. దీనిపై మంత్రి పొంగులేటి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పేరు చెప్పి ఎవరైనా మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. " ఎవరైనా నా పీఏలమని ఫోన్ చేస్తే నా దృష్టికి తీసుకురావాలి. నా కార్యాలయం 040-234561072/ 040-23451073కు ఫోన్ చేసి చెప్పాలి" అని తెలిపారు.

## సిద్దిపేటకు తెలంగాణకు పేగుబంధం



కరపత్రం
తెలుగు దిన పత్రిక



# జేబులు నింపుకునేందుకే కాళేశ్వరం

మొదటిపేజీ తరువాయి

రైతులకు బీఆర్ఎస్ క్షమాపణ చెప్పాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్డీఎస్ఏ రిపోర్టుపై అధ్యయం చేస్తామన్నారు. వచ్చే కేబినెట్‌లో ఎన్డీఎస్ఏపై చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. ఎవడి అయ్య జాగీరు అని కట్టారని ప్రశ్నిస్తూ.. కాళేశ్వరం రైతుల కోసం కాదు జేబులు నింపుకునేందుకు కట్టారు అంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్డీఎస్ఏ రిపోర్టు రావడంతో బీఆర్ఎస్‌పై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీ ఇచ్చిన నివేదికను చూసి బీఆర్ఎస్ నేతలు సిగ్గు పడాలంటూ మండిపడ్డారు. కాళేశ్వరంతో అద్భుతాలు సృష్టిస్తున్నామని చెప్పి లక్ష కోట్ల ప్రాజెక్ట్ కట్టారని.. ఎన్డీఎస్ఏ నివేదిక చూసి బీఆర్ఎస్ సిగ్గుపడాలన్నారు. 'మీరే డిజైన్ చేశారు.. మీరే కట్టారు.. మీరుండగానే కూలిపోయింది' అని తెలిపారు. మేడిగడ్డ సుందిళ్ళ నిరుపయోగంగా
ఉన్న రికార్డు స్థాయిలో పంటలు పండాయని తెలిపారు. అబద్ధాలు తప్పులపై బతకాలని బీఆర్ఎస్ అనుకుంటోందని.. అది కుదరదని స్పష్టం చేశారు. నిర్మాణం చేసిన వాళ్ళు.. చేయించిన వాళ్ళు రైతులకు ద్రోహం చేశారని ఆరోపించారు. ఎన్డీఎస్ఏను రేవంత్ రెడ్డినో.. నేనో వేసింది కాదు. దేశంలో బెస్ట్ ఎక్స్‌పర్ట్స్ ఎన్డీఎస్ఏలో ఉన్నారు. మీరు అధికారంలో ఉన్నప్పుడే ఎన్డీఎస్ఏ వచ్చిందని చెప్పుకొచ్చారు. కాళేశ్వరంతో అద్భుతాలు సృష్టిస్తున్నాము అని చెప్పి లక్ష కోట్ల ప్రాజెక్ట్ కట్టారు..కాళేశ్వరం రైతుల కోసం కాదు జేబులు నింపుకునేందుకు కట్టారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు.

# తెలంగాణలో ఉన్న పాకిస్తానీలు.. వెంటనే పాకిస్తాన్ వెళ్లిపోవాలి: డీజీపీ జితేందర్ ఆదేశాలు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణలో ఉన్న పాకిస్తానీలు వెంటనే తమ దేశానికి వెళ్లిపోవాలని –తెలంగాణ డీజీపీ జితేందర్ అల్టిమేటం జారీ చేశారు. పాకిస్తానీల వీసాలు 27 తర్వాత పనిచేయవని, మెడికల్ వీసాల మీద ఉన్నవారికీ ఏప్రిల్ 29 వరకు మాత్రమే గడువు ఉందని ఆయన స్పష్టం చేశారు. లాంగ్ టర్మ్ వీసాలు కలిగిన వారికి ఈ నిబంధన వర్తించదని ఆయన వివరించారు. పాకిస్థానీలు తమ దేశానికి అటారి బార్డర్ నుంచి వెళ్లొచ్చని, ఏప్రిల్ 30 వరకు అటారి బార్డర్ తెరుచుకుని ఉంటుందని ఆయన తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాకిస్తానీలు తమ దేశానికి వెళ్లిపోవాలని, ఒకవేళ అక్రమంగా తెలంగాణలో ఉంటే న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని తెలంగాణ రాష్ట్ర డీజీపీ జితేందర్ హెచ్చరించారు. రాష్ట్రాల్లోని పాకిస్థానీయులను గుర్తించి వెంటనే వారిని పాకిస్తాన్?కు పంపాలని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే పాకిస్తానీయులకు జారీ చేసిన అన్ని వీసాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది.

వారం రోజుల్లోగా దేశం విడిచి వెళ్లాలని ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలో హైదరాబాద్?లో ఉన్న పాకిస్తానీయులపై పోలీసులు ఫోకస్ పెట్టారు. సిటీలో ఉన్న పాక్ పౌరుల వివరాలను సేకరించారు. హైదరాబాద్?లో మొత్తం 208 మంది మంది పాకిస్తానీయులు ఉన్నట్లు సమాచారం. వీరందరిని రెండు రోజుల్లో వెళ్లిపోవాలని పోలీసులు స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

# శుభం ద్వివేది కుటుంబానికి యోగి పరామర్శ

మొదటిపేజీ తరువాయి

### కుటుంబ సభ్యుల రోదనలతో కన్నీరు చిందించిన యోగి

జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. కుటుంబసభ్యులతో కలిసి సరదాగా విహార యాత్రకు వచ్చిన వారికి విషాదమే మిగిలింది. ఉగ్రదాడిలో చనిపోయిన వారిలో కాన్పూర్‌కు చెందిన శుభం ద్వివేది ఒకరు. భార్యతో కలిసి శుభం వివాహరయాత్రకు పహల్గామ్‌కు వచ్చి ఉగ్రతూటాలకు బలయ్యారు. శుభంకు రెండు నెలల క్రితమే వివాహం జరిగింది. విహహం జరిగి, ఎంతో మంచి భవిష్యత్ ఉన్న శుభం.. ముష్కరుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోవడం ప్రతిఒక్కరినీ కలిచి వేసింది. అలాగే యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా తీవ్ర భావోద్వేనికి గురయ్యారు. కన్నీరు పెట్టు–న్నారు. యోగి ఆదిత్యనాథ్‌కు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఉగ్రమూకల దాడిలో అమరుడైన శుభం ద్వివేది కుటుంబాన్ని పరామర్శించేందుకు యూపీ సీఎం యోగి వెళ్లారు. సీఎంను చూడగానే శుభం భార్య ఐష్ణయ కన్నీరుమున్నీరుగా విలపించారు. శుభం తండ్రిని ముఖ్యమంత్రి ఓదార్చారు. తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. శుభం తల్లిదండ్రులకు ఆయన ఒక్కడే సంతానమని, రెండు నెలల క్రితమే వివాహం జరిగినట్లు చెప్పారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అలాగే శుభం కుటుంబ సభ్యులకు సీఎం యోగి సానుభూతిని తెలియజేశారు.కాగా.. శుభం ఇంటికి సీఎం యోగా వెళ్లగానే అక్కడ ఒక ఉద్వేగభరితమైన వాతావరణం నెలకొంది. సీఎంను చూడగానే శుభం కుటుంబసభ్యులు కంటతడి పెట్టుకున్నారు. ఈ సందర్భంగా శుభం భార్య చెప్పిన మాటలతో ముఖ్యమంత్రి యోగి కూడా చలించిపోయారు. 'ఉగ్రమూకల దాడిలో నా భర్త మరణించాడు.. సార్ మేము ప్రతీకారం తీర్చుకోవాలని అనుకుంటున్నాం' అంటూ కన్నీరు పెట్టుకుంటూ ఐష్ణయ చెప్పిన మాటలతో యూపీ సీఎం కూడా తనను తాను నియంత్రించుకోలేకపోయారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని.. తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. యూపీ సీఎం యోగీ.. శుభం ఇంటి నుంచి కన్నీరు పెట్టుకుంటూ వెళ్తున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియోను చూసి నెటిజన్లు కూడా భావోద్వేగానికి గురవుతున్నారు. ఇక.. శుభం ద్వివేది అంత్యక్రియలు గురువారం ప్రభుత్వ అధికారికి లాంఛనాలతో నిర్వహించారు. దేవోరి ఘాట్‌లో వేలాది మంది ప్రజలు శుభంకు కన్నీటితో వీడ్కోలు పలికారు.

# దేశాన్ని చీల్చడమే ఉగ్రవాదుల లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

పహల్‌గామ్ ఉగ్ర దాడి వెనుక వ్యూహం దేశ ప్రజలను చీల్చడం అని, ఉగ్రవాదాన్ని శాశ్వతంగా ఓడించేందుకు భారత్ సంఘటితంగా నిలవడం తప్పనిసరి అని లోక్‌సభలోని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం ఉద్ఘాటించారు. 'అది దుర్భర విషాదం. ఏమి జరుగుతోందో తెలుసుకుని, సాయం చేయడానికి ఇక్కడికి వచ్చాను. జమ్మూ కాశ్మీర్ ప్రజలు అందరూ ఈ భీకర దాడిని ఖండించారు. వారు దేశానికి పూర్తి మద్దతు ప్రకటించారు' అని రాహుల్ శ్రీనగర్‌లో విలేకరులతో చెప్పారు. శుక్రవారం ఉదయం శ్రీనగర్ చేరుకున్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ క్షతగాత్రుల గురించి వాకబు చేయడానికి బాదామిబాఘ్ కంటోన్మెంట్‌లో ఆర్మీ 92 బేస్ ఆసుపత్రిని సందర్శించారు. 'క్షతగాత్రుల్లో ఒకరిని పరామర్శించాను. తక్కినవారు వెనుకకు వెళ్లిపోయినందున వారిని కలుసుకోలేకపోయాను. కుటంబ సభ్యులను కోల్పోయిన ప్రతి ఒక్కరికీ నా సానుభూతి. దేశం సంఘటితంగా నిలుస్తున్నదని ప్రతి ఒక్కరికీ తెలియాలని అనుకుంటు–న్నా' అని రాహుల్ చెప్పారు. గురువారం ఢిల్లీలో జరిగిన అఖిల పక్ష సమావేశం గురించి రాహుల్ ప్రస్తావిస్తూ, మొత్తం ప్రతిపక్షాలు ఉగ్ర దాడిని ఖండించాయని, ప్రభుత్వానికి దన్నుగా ఉన్నాయని తెలిపారు. రాహుల్ జెకె లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాను, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను కూడా కలుసుకున్నారు. పహల్‌గామ్‌లో పరిణామాల గురించి ఆయనకు వారిద్దరు వివరించారు. 'మా పార్టీ వారికి మద్దతు ఇవ్వబోతున్నదని వారిద్దరికీ హామీ ఇచ్చాను' అని రాహుల్ తెలియజేశారు. రాహుల్ అంతకుముందు వర్తకుల ప్రతినిధివర్గాన్ని, విద్యార్థుల నాయకులను, పర్యాటక రంగానికి సంబంధించినవారిని కలుసుకున్నారు.

# హాస్టల్ వార్డెన్‌ను అరెస్ట్ చేయాలంటూ కాలేజీ విద్యార్థుల ఆందోళన

ఘట్‌కేసర్: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అవుషాపూర్ వీబీఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఆందోళనకు దిగారు. కళాశాలకు చెందిన వసతిగృహ వార్డెన్ విద్యార్థినులను అసభ్యకరంగా ఫొటోలు తీసి సోషల్‌మీడియాలో పోస్ట్ చేస్తున్నారని ఆరోపించారు. అమ్మాయిలు షార్ట్స్ వేసుకొని ఉండగా వార్డెన్ ఫొటోలు తీశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ వార్డెన్‌ను అరెస్ట్ చేయాలంటూ కాలేజీ గేటు ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో కాలేజీకి చేరుకున్న పోలీసులు.. విద్యార్థులకు నచ్చజెప్పారు. విచారణ చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు.. ప్రభాకర్‌రావు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణలో తీవ్ర చర్చనీయాంశమైన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఐజీ ప్రభాకర్‌రావు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. ఆయన తరఫున ప్రముఖ న్యాయవాది సి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ప్రభాకర్‌రావు ప్రస్తుతం అమెరికాలో ఉన్నారని, ముందస్తు బెయిల్ ఇస్తే వెంటనే హైదరాబాద్ వస్తారని కోర్టుకు వివరించారు. ఆయన 30 ఏళ్లకు పైగా వివిధ హెూదాల్లో పని చేశారని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు.ప్రస్తుతం ఆయన క్యాన్సర్‌తో బాధపడుతున్నారని వివరించారు. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న శ్రవణ్‌రావు ముందస్తు బెయిల్ పొందారని, అందువల్ల ప్రభాకర్‌రావుకు కూడా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. బెయిల్ ఇస్తే దర్యాప్తునకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారని, రాజకీయ కక్ష సాధింపు చర్యగా ఫోన్ ట్యాపింగ్ కేసు పెట్టారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ సాక్ష్యాలను ధ్వంసం చేశారన్నది నిజం కాదని వాదించారు. పోలీసుల తరఫున సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. 65 ఏళ్ల వయసుందన్న సాకుతో ప్రభాకర్‌రావు దర్యాప్తు నుంచి తప్పించుకోలేరన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు పూర్తి ఆధారాలు ఉన్నాయని, హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేసి నీళ్లలో పడేసినట్లు దర్యాప్తులో తేలిందని లూథ్రా న్యాయస్థానానికి వివరించారు. ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయొద్దని కోరారు. ఇరువైపు వాదనలు విన్న న్యాయస్థానం.. తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది.

# వక్ఫ్ సవరణ చట్టంపై పిల్.. సుప్రీంలో తేలాక చూద్దామన్న హైకోర్టు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: వక్ఫ్ సవరణ చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయొద్దంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఆక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఈ పిల్‌ను దాఖలు చేసింది. వక్ఫ్ సవరణ చట్టంలోని పలు సెక్షన్లను పిటిషన్‌లో సవాల్ చేసింది. అయితే, వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోందని, అక్కడ తేలిన తర్వాత ఈ పిటిషన్‌ను పరిశీలిద్దామని హైకోర్టు తెలిపింది. తదుపరి విచారణను వేసవి సెలవుల తర్వాతకు వాయిదా వేసింది.

# తెలంగాణకు వచ్చిన పాక్ పౌరులు ఈనెల 30లోపు వాఘా సరిహద్దు దాటాలి: డీజీపీ జితేందర్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణకు వచ్చిన పాకిస్థానీయులకు డీజీపీ జితేందర్ కీలక ఆదేశాలు జారీ చేశారు. వారంతా వెంటనే దేశం విడిచి వెళ్లిపోవాలన్నారు. పాకిస్థానీయులకు వీసాలను కేంద్రం నిలిపివేసిందని, ఇప్పటికే వీసాలు పొందిన వారికి ఈనెల 27 వరకు గడువు ఉందని చెప్పారు. మెడికల్ వీసాలపై వచ్చిన వారికి ఈనెల 29కు అనుమతి ఉందన్నారు. ఈ నెల 30 వరకే వాఘా సరిహద్దు తెరిచి ఉంటుందని చెప్పారు. అప్పట్లోపు తెలంగాణలో ఉన్న పాక్ పౌరులు వాఘా సరిహద్దు దాటాలన్నారు. ఆదేశాలను ఉల్లంఘిస్తే.. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# హెచ్ఐసీసీలో 'భారత్ సమ్మిట్'.. విదేశీ ప్రతినిధులకు ఘనస్వాగతం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: హెచ్ఐసీసీలోని నోవాటెల్ వేదికగా తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో 'భారత్ సమ్మిట్' జరుగుతోంది. పెట్టుబడులు, న్యాయం, అహింస, ప్రపంచ శాంతి లక్ష్యంగా దీన్ని నిర్వహిస్తున్నారు. వివిధ దేశాల నుంచి ప్రతినిధులు తరలివచ్చారు. భారత్ సమ్మిట్‌కు వచ్చిన విదేశీ ప్రతినిధులకు ఘనస్వాగతం లభించింది. తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా కళాకారులు, పలువురు కాంగ్రెస్ నేతలు స్వాగతం పలికారు. బోనాల డప్పులు, సాంస్కృతిక కార్యక్రమాలతో సదస్సుకు వారిని ఆహ్వానించారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు విదేశీ ప్రతినిధులు మంత్రముగ్ధులయ్యారు.

# సిద్దిపేటకు తెలంగాణకు పేగుబంధం



మొదటిపేజీ తరువాయి

### ఆనాడు కెసిఆర్ ఇక్కడి నుంచే కదిలారు

### యువత ర్యాలీని ప్రారంభించిన హరీష్ రావు

తెలంగాణ ఉద్యమానికి సిద్దిపేటకు పేగు బంధం ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. నేడు విద్యార్థులు, యువత చేపట్టిన పాదయాత్ర రేపు బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడానికి విజయ యాత్రగా కాబోతున్నదని చెప్పారు. సిద్దిపేట నియోజకవర్గం కేంద్రం రంగదాంపల్లి అమర వీరుల స్థూపం నుంచి వరంగల్ సభ వద్దకు వెయ్యి మంది విద్యార్థి, యువత చేపట్టిన పాదయాత్రను హరీశ్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..నాడు సిద్దిపేట నుంచే కేసీఆర్ సైకిల్ యాత్ర చేపట్టి వరంగల్ సభకు ఊళ్లకు ఊళ్లు కదిలించారని గుర్తుచేశారు. చాలా పార్టీలు పుడుతుంటాయి, పోతుంటాయి.. కానీ బీఆర్ఎస్ మాత్రం లక్ష్యాన్ని ముద్దాడిందని తెలిపారు. కేసీఆర్ అనే ఒక గొంతు కోట్ల గొంతుకలను ఏకం చేసిందన్నారు. 14 ఏండ్ల ఉద్యమం, పదేండ్ల ప్రభుత్వం, ఇప్పుడు ఏడాదిన్నర ప్రతిపక్షం.. ఏ పాత్ర అయినా బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ పక్షమేనని స్పష్టం చేశారు. లంకలో రావణుడి అరాచకాలను అరికట్టడానికి ఆనాడు రామదండు కదిలింది. నేడు మన రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎదిరించడానికి ఈ గులాబీ దండు కదిలిందని చెప్పారు. 'కాశ్మీర్‌లోని పెహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారికి 2 నిమిషాలు శ్రద్ధాంజలి ఘటిద్దాం. ఈరోజు మన సిద్దిపేట నుంచి పాదయాత్రలో బయలుదేరిన విద్యార్థి యువ మిత్రులకు, ఉద్యమకారులకు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అందరికీ శిరస్సు వంచి నమస్కారం తెలియజేస్తున్నా. 44 డిగ్రీల ఎండను కూడా లెక్క చేయకుండా 1500 మంది ఈనెల 27న వరంగల్‌లో జరగబోయే పార్టీ రజతోత్సవం కోసం స్వచ్ఛందంగా తరలివచ్చిన మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు.

# హైదరాబాద్‌లో హై అలర్ట్ : భారత్ సమ్మిట్, మిస్ వరల్డ్ పోటీల క్రమంలో ఫుల్ సెక్యూరిటీ




కశ్మీర్ పహల్గాం ఉగ్రదాడి జరిగిన తరుణంలో మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉందని కేంద్ర నిఘావర్గాల హెచ్చరికతో తెలంగాణ ప్రభుత్వం అలర్ట్ అయ్యింది. ఇంటెలిజెన్స్ హెచ్చరికలతో పోలీసు శాఖ అప్రమత్తం అయ్యింది. హైదరాబాద్ లో ప్రతిష్టాత్మకమైన ఈవెంట్లు ఉన్న తరుణంలా సెక్యూరిటీని అలర్ చేసింది. ఏప్రిల్ 25, 26 తేదీల్లో భారత్ సమ్మిట్, మే 7 నుంచి మిస్ వరల్డ్–2025 ఈవెంట్లు ఉండటంతో పోలీసు వర్గాలు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేస్తున్నారు.భారత్ సమ్మిట్ లో జాతీయ, అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక పరమైన అంశాలపై చర్చ జరగనుంది. ఈ సమ్మిట్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సహా వంద దేశాల నుంచి దాదాపు 400 మంది హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా మిస్ వరల్డ్ పోటీలకు 140 దేశాల నుంచి కంటెస్టెంట్స్ హాజరవుతారు. ఇవన్నీ అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమాలు కావడంతో పోలీస్ యంత్రాంగానికి సవాల్ గా మారింది. ఈ కార్యక్రమాలకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు కార్యాచరణ రూపొందిస్తున్నారు. అందులో భాగంగా హెచ్ఐసీసీ, సైబరాబాద్ పరిసర ప్రాంతాల్లో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయనున్నారు పోలీసులు.కశ్మీర్ పహల్గాం ఉగ్రదాడి జరిగిన తరుణంలో దేశ వ్యాప్తంగా మరిన్ని ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందన్న కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికలతో రాష్ట్ర పోలీసులు అప్రమత్తం అయ్యింది. దీంతో కౌంటర్ ఇంటెలిజెన్స్ సహా అన్ని విభాగాలు అప్రమత్తం అయ్యాయి. హైదరాబాద్ సహా దేశంలో ఉగ్రవాద ప్రభావిత రాష్ట్రాలు మరింత అప్రమత్తంగా ఉండాలన్న హెచ్చరికలు జారీ చేసిన క్రమంలో ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేకంగా మానిటరింగ్ చేస్తోంది. ఈ క్రమంలో సీఎస్ శాంతికుమారి రాష్ట్ర పోలీస్ యంత్రాంగాన్ని అలర్ట్ చేశారు. నిఘా సంస్థలు హెచ్చరికలు జారీ చేసిన సందర్భంగా డీజీపీ జితేందర్ రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులకు పలు అంశాలపై సూచనలు చేశారు. హైదరాబాద్‌లో ఇప్పటికే టెర్రరిస్టుల దాడులకు గురైన ప్రాంతాలు సహా పర్యాటక ప్రాంతాల్లో భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేశారు. కౌంటర్ ఇంటెలిజెన్స్ ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. అనుమానితులు, సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్టమైన నిఘా పెట్టినట్టు తెలుస్తోంది. సైబరాబాద్ కమిషనరేట్ పరిసర ప్రాంతాలను గురువారం (ఏప్రిల్ 24) రాత్రి నుంచే తమ ఆధీనంలోకి తీసుకోనున్నారు. హైటెక్ సిటీ సహా విదేశీయులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో స్థానిక పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. పాతబస్తీ సహా అనుమానిత ప్రాంతాల్లో పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా పెట్టనున్నారు పోలీసులు.

# అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగానే ఎమ్మార్పీఎస్ పోరాటం

కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి

**లింగంపేటమండలం లొంకలపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ భూమి పూజ, జెండా ఆవిష్కరణ.**

**కామారెడ్డి జిల్లా పర్యవేక్షకులు మంథని సామ్యేల్ మాదిగ.**





అంబేద్కర్ కోరుకున్న సామాజిక న్యాయం కోసం గత ముప్పై ఏళ్ళు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ తో పాటు అనేక అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎమ్మార్పీఎస్ ఉద్యమించడం జరిగిందని తెలియ చేస్తున్నాం.అంబేద్కర్ ఆశయాల సాధనకై ఇకనుండి మందకృష్ణ మాదిగ బాటలోనే మహాజనులైన పీడిత వర్గప్రజలు నడవాలని పిలుపునిస్తున్నాం.అన్నివర్గాల తో సమానంగా హక్కులు అవకాశాలు అందాలని అంబేద్కర్ రిజర్వేషన్ లు సాధిస్తే... ఎస్సీల్లో అన్ని కులాలకు అవకాశాలు అందేవిధంగా గౌ శ్రీ మందకృష్ణ మాదిగ గారు రిజర్వేషన్ల వర్గీకరణ సాధించారని గుర్తు చేస్తున్నాం బాబా సాహెబ్ అంబేద్కర్ కోరుకున్న సామాజిక న్యాయం అన్ని వర్గాలకు అందాలని ఎస్సీ రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన సమన్యాయం అందించాలని ఆయన చేసిన పోరాటం విజయం సాధించిందని, అత్యున్నత న్యాయస్థానం నుండి, మొదలుకొని చట్టసభల్లో ఆయన విజ్ఞప్తి ని డిమాండ్ ను చట్టాలు చేయాల్సి వచ్చిందని గుర్తు చేస్తున్నాం.చెప్పులు కుట్టిన చేతులతోనే చరిత్ర తిరగ రాస్తాం అని చెప్పి ఒక సామాజిక ఉద్యమాన్ని ప్రకాశం జిల్లా ఈదుమూడి నుండి మొదలు పెట్టి చరిత్ర తిరగరాసిన సామాజిక ఉద్యమ యోధుడు గౌ శ్రీ... పద్మశ్రీ... మందకృష్ణ మాదిగ అని గుర్తు చేస్తున్నాం...బాబా సాహెబ్ అంబేద్కర్ వారసులు గౌ శ్రీ మందకృష్ణ మాదిగ బాటలోనే మహాజనులైన పీడిత వర్గప్రజలు నడవాలని పిలుపునిస్తున్నాం రంగేరిసాయిలు మాదిగ ఆద్వర్యంలో జరిగిన ఈకార్యక్రమానికి జిల్లా పర్యవేక్షకులు మంథని సామ్యేల్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరు కాగా జిల్లా సీనియర్ నాయకులు కొత్తోల్ల యాదగిరి మాదిగ, మహిళా విభాగం నాయకురాలు సట్టిగారి లక్ష్మి మాదిగ, బానపురం లావణ్య మాదిగ, నాగిరెడ్డి పేట మండల అధ్యక్షులు తొంట సాయిలు మాదిగ, ఎల్లారెడ్డి మండల అధ్యక్షులు రామగల్ల శివానందం మాదిగ, రామారెడ్డి మండల ఉపాధ్యక్షులు కాస్తారి శైలేష్ మాదిగ, గ్రామ మాదిగ లు, మహిళలు, విధ్యార్థులు పాల్గొన్నారు

# గొర్రెల దొంగతనానికి యత్నం

–హుజురాబాద్:

పట్టణ పరిధిలోని దమ్మక్కపేట గ్రామంలో గురువారం రాత్రి గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు గొర్రెల దొంగతనానికి యత్నించారు. ఇది గమనించిన గొర్రెల కాపరులు పట్టుకునే ప్రయత్నం చేయగా ఒకరు పారిపోగా మరొకరు పట్టుపడ్డాడు. ఆ దొంగను పోలీస్ స్టేషన్లో అప్పచెప్పారు. పట్టుబడ్డ దొంగ పెద్ద పాపయ్య పల్లెకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన గొర్రెల కాపరులు ఇక్కడికి వచ్చి పొలాల్లో గొర్రెల మందను పెడుతుంటారు. గతంలో ఇలాగే మందల నుంచి పలుమార్లు దొంగలు దోపిడికి పాల్పడి దాదాపుగా 40 గొర్రెలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. గొర్రెల కాపరి బీరప్ప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈ

## పాకిస్తాన్ భారత్ సింధు జలాల ఒప్పందం రద్దు

# పాక్ కు తత్సంబంధ లేఖ రాసిన భారత్


శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్

**– జమ్మూ కాశ్మీర్‌ను లక్ష్యంగా చేసుకుని నిరంతర సరిహద్దు ఉగ్రవాదం ద్వారా ఇస్లామాబాద్ సింధు జలాల ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించిందని పాకిస్తాన్‌కు రాసిన లేఖలో భారతదేశం పేర్కొంది.**




**సంక్షిప్తంగా**

జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాద దాడి తర్వాత జల ఒప్పందాన్ని నిలిపివేశారు.లోయలో సీమాంతర ఉగ్రవాదం ద్వారా పాకిస్తాన్ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని భారతదేశం ఆరోపించింది.నీటిని మళ్లించడం 'యుద్ధ చర్య'గా పరిగణించబడుతుందని పాకిస్తాన్ భారతదేశాన్ని హెచ్చరించింది.జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది మరణించగా, వారిలో ఎక్కువ మంది పర్యాటకులు గాయపడిన నేపథ్యంలో, సింధు జలాల ఒప్పందాన్ని తక్షణమే నిలిపివేయాలని న్యూఢిల్లీ తీసుకున్న నిర్ణయాన్ని భారత్ గురువారం పాకిస్తాన్‌కు అధికారికంగా తెలియజేసింది.భారత జల వనరుల కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ పాకిస్తాన్ జల వనరుల కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తజాకు రాసిన అధికారిక లేఖ ద్వారా వచ్చిన ఈ నోటిఫికేషన్‌లో, జమ్మూ కాశ్మీర్‌ను లక్ష్యంగా చేసుకుని నిరంతర సరిహద్దు ఉగ్రవాదం ద్వారా ఇస్లామాబాద్ ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించిందని పేర్కొంది.ఒక ఒప్పందాన్ని మంచి విశ్వాసంతో గౌరవించాల్సిన బాధ్యత ఒక ఒప్పందానికి ప్రాథమికమైనది.అయితే, బదులుగా మనం భారత్ కు లభించేమిటి? భారత కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూ కాశ్మీర్‌ను లక్ష్యంగా చేసుకుని పాకిస్తాన్ కొనసాగించే సీమాంతర ఉగ్రవాదం" అని లేఖలో పేర్కొన్నారు.ఫలితంగా ఏర్పడిన భద్రతా అనిశ్చితులు ఒప్పందం ప్రకారం భారతదేశం తన హక్కులను పూర్తిగా ఉపయోగించుకోకుండా నేరుగా అడ్డుకున్నాయి. అంతేకాకుండా, పాకిస్తాన్ చేసిన ఇతర ఉల్లంఘనలతో పాటు, ఒప్పందం ప్రకారం చర్చలు జరపాలన్న భారతదేశం చేసిన అభ్యర్థనకు స్పందించడానికి పాకిస్తాన్ నిరాకరించింది మరియు తద్వారా ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోంది. 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని తక్షణమే నిలిపివేయాలని భారత ప్రభుత్వం ఇందుమూలంగా నిర్ణయించింది" అని అది జోడించింది.ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంలో, సింధూ జలాల ఒప్పందం 1960 నుండి భారతదేశం మరియు పాకిస్తాన్ మధ్య సింధూ నది మరియు దాని ఉపనదుల వాడకాన్ని నియంత్రించింది.అంతకుముందు రోజు, భారతదేశం జారీ చేసిన అనేక దౌత్యపరమైన దాడులతో విసుగు చెందిన పాకిస్తాన్ ప్రభుత్వం, సింధు జల ఒప్పందం ప్రకారం తమ కోసం ఉద్దేశించిన నీటిని మళ్లించడానికి చేసే ఏ చర్యనైనా "యుద్ధ చర్య"గా పరిగణిస్తామని తెలిపింది."సింధూ జలాల ఒప్పందం ప్రకారం పాకిస్తాన్‌కు చెందిన నీటి ప్రవాహాన్ని ఆపడానికి లేదా మళ్లించడానికి మరియు దిగువ నదీ తీరప్రాంతాల హక్కులను ఆక్రమించడానికి చేసే ఏ ప్రయత్నమైనా యుద్ధ చర్యగా పరిగణించబడుతుంది" అని పాకిస్తాన్ జాతీయ భద్రతా కమిటీ (ఎన్ఎస్‌సి) విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.


देवश्री मुखर्जी
Debashree Mukherjee
सचिव
SECRETARY

भारत सरकार
जल शक्ति मंत्रालय
जल संसाधन, नदी विकास
और गंगा संरक्षण विभाग
GOVERNMENT OF INDIA
MINISTRY OF JAL SHAKTI
DEPARTMENT OF WATER RESOURCES,
RIVER DEVELOPMENT & GANGA REJUVENATION

D. O. No. Y-18012/1/2024-Indus | 24th April, 2025

Dear Mr. Murtaza,

This is with reference to Government of India's notices sent to the Government of Pakistan seeking modification of the Indus Waters Treaty 1960 (the Treaty) under Article XII (3) of the Treaty. These communications cited fundamental changes in the circumstances that have taken place since the Treaty was executed that require a re-assessment of obligations under the various Articles of the Treaty read with its Annexures.

2. These changes include significantly altered population demographics, the need to accelerate the development of clean energy and other changes in the assumptions underlying the sharing of waters under the Treaty.

3. The obligation to honour a treaty in good faith is fundamental to a treaty. However, what we have seen instead is sustained cross border terrorism by Pakistan targeting the Indian Union Territory of Jammu and Kashmir.

4. The resulting security uncertainties have directly impeded India's full utilization of its rights under the Treaty. Furthermore, apart from other breaches committed by it, Pakistan has refused to respond to India's request to enter into negotiations as envisaged under the Treaty and is thus in breach of the Treaty.

5. The Government of India has hereby decided that the Indus Waters Treaty 1960 will be held in abeyance with immediate effect.

With Regards,

Yours sincerely,

(Debashree Mukherjee)

Mr. Syed Ali Murtaza,
Secretary
Ministry of Water Resources,
Pakistan, Islamabad.

श्रम शक्ति भवन,रफी मार्ग, नई दिल्ली-110 001 / Shram Shakti Bhawan, Rafi Marg, New Delhi-110 001
Tel. : 011-23710305, 23715919, Fax : 011-23731553, E-mail : secy-mowr@nic.in, Website : http://www.mowr.gov.in


## భారత్ మరో కీలక నిర్ణయం..
## ఆ ఒప్పందం రద్దు!!!!



**న్యూ ఢిల్లీ కరపత్రం ప్రతినిధి**

పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్తాన్పై దౌత్య చర్యలు తీసుకుంటున్న భారత్ మరో సంచలన నిర్ణయానికి సిద్ధమవుతుందనే వార్తలు వినిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో భారత్.. పాకిస్తాన్తో "కాల్పుల విరమణ"ను రద్దు చేసుకునే అవకాశం ఉన్నట్లు కథనాలు వస్తున్నాయి. భారత్, పాకిస్తాన్ దేశాల సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్స్ మధ్య జరిగిన సమావేశం తర్వాత ఫిబ్రవరి 24, కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి 2021లో వచ్చింది.

## అధిక ధరల మద్యం బాటిళ్లలో తక్కువ ధర మద్యం, నీళ్లను కలుపుతున్న కేటుగాళ్లు



**లింగంపల్లి కరపత్రం ప్రతినిధి**

బార్‌లో మద్యాన్ని కల్తీ చేస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు లింగంపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అయ్యప్ప సోసైటీ ప్రాంతంలో ట్రూప్స్ బార్‌ను రెన్యువల్ చేయలేదు.. ఫీజు కూడా చెల్లించలేదని బార్‌లోకి వెళ్లిన అధికారులు అయితే బార్‌లో ఖరీదైన మద్యం బాటిళ్ల సీల్ తీసి తక్కువ ధరలు కలిగిన మద్యాన్ని కలుపుతుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు రూ. 2690 ధర గల జేమ్సన్ బాటిల్లో రూ.1000 ధర కలిగిన ఓక్స్మిత్ మద్యాన్ని కలుపుతుండగా పట్టుకున్న అధికారులు 75 కల్తీ బాటిళ్లను, 55 ఖాళీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ సిబ్బంది బార్ లైసెన్స్, ఓనర్ ఉద్యాకుమార్ రెడ్డి, మేనేజర్ వి. సత్యనారాయణ రెడ్డి, బార్‌లో పని చేసే ఉద్యోగి పునిత్ పట్నాయక్‌లపై కేసు నమోదు చేసి లింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించిన అధికారులు

# తనను తాను చెక్కుకున్న అమరశిల్పి అక్కినేని నాగేశ్వర రావు

**– అక్కినేని గురించి ఆత్రేయ వ్యాసం**

సేకరణ: మద్రి శంకరయ్య, హైద్రాబాద్

అడుగు మోపే స్థలమిచ్చేసరికి అలా పెరిగిపోయాడు వామనుడు.

నాగేశ్వరరావుకు అడుగు మోపే అవకాశం ఎవరిస్తే ఏం? ఎలా పెరిగాడు,ఏం సాధించాడు అనేదే కథానాయకుడి కథ.

- ఎలా పెరిగాడు?

జీరో లాంటి వేషంతో ప్రవేశించి,హీరో దాకా పెరిగాడు.

- ఏం సాధించాడు?

లక్షలు కోట్లు వివరాలు మాత్రం ఇన్ కమ్ టాక్స్ వాళ్ళకూ,ఆయనకూ తెలుసు.
బాగా సంపాదించాడు
మద్రాసులో ఒక ఇల్లు కొన్నాడు.అమ్మాడు.
మరొక ఇల్లు కట్టాడు. అమ్మాడు.
హైదరాబాద్ లో ఒక ఇల్లు కొన్నాడు.
ఇంకొక ఇల్లు కడుతున్నాడు.
పొడి చేస్తాం, దంచేస్తాం అనే ఒక పరిశ్రమ,మరికొన్ని పరిశ్రమలూ పెట్టాడు.
పిల్లల భవిష్యత్తుకు కావల్సిన ఏర్పాట్లన్నీ చేసాడు.
మంచి కార్లున్నాయి కాబట్టి తిరుగుతాడేమో అనుకుంటే,
మంచి సంసారం ఉండబట్టే తిరగటం లేదు.
తానట్టే చదువు కోలేదు కనుక ఇతరులైనా చుదువుకోనీ అని గుడివాడలో తన పేరిట ఒక కాలేజీ పెడతామంటే సరేనని విరాళమిచ్చాడు.
త్వరలోనే ఇలాంటివి మరికొన్ని చేస్తాడంటున్నారు.
చేస్తాడు..ఇదయ్యా కథ..
"ఇదంతా మాకు తెలిసిందే కదయ్యా" అంటారు.
అవును. మీకు తెలియనిది చెప్పమంటారా?
చెప్తాను. నాగేశ్వరరావు అందగాడు కాదు
దేశంలో కొందరమ్మాయలు నా మీద విరుచుకు పడ్డా సరే..అన్నపూర్ణమ్మగారు నన్ను క్షమిస్తారు కనుక అందగాడు కాదు.
నాగేశ్వరరావుకు మంచి కళ్ళు లేవు.
కంఠం అంత కన్నా లేదు.
ఒడ్డూ పొడుగూ విగ్రహం లేదు. బాషా పాండిత్యం లేదు.
ఇంతెందుకు నటుడికి కావలిసిన లక్షణాలు అసలు లేవు
అయినా–హీరో అయ్యాడు.
ఇప్పటికీ హీరోగా ఉన్నాడు..
ఇంకా ఉంటాడు...ఇదయ్యా కథ.."
ఇదీ మాకు తెలిసిందే కదయ్యా?"... అంటారు.
మీకేమిటి, ఇవన్నీ నాగేశ్వరరావుకే తెలుసు.

కనుక మీకూ..ఆయనకూ తెలియందొకటి చెప్తాను.
నెల్లూరులో 'మాయాలోకం' విడుదలైంది చూశాను.
అందులో ఆ కుర్రాడి పేరు నాగేశ్వరరావు అని నాకు తెలియదు కానీ ఈ కుర్రాడెవరో ఫరవాలేదు.కంఠమూ, బిగుసుకు పోవటమూ..ఈ రెండూ సర్దుకుంటే పనికొస్తాడు,అని నేననుకున్నాను.పక్క నెవరితోనో అన్నాను కూడా ఇప్పుడు పెద్ద వాళ్ళయిన వాళ్ళందర్ని గురించి ఒకప్పుడిలా అనుకున్నామని చాలా మంది చెప్పడం సహజం.నేను ఆ జాబితాలో చేరను.ఎందుచేతంటే నేనప్పుడు నాటకాలలో ఉన్నాను.ప్రతిభను వెతకటం,గుర్తించటం నా వృత్తిగా ఉండేది.పైన నేను ఉదహరించిన రెండులోపాలూ ఆయన ఏ మాత్రం సర్దుకున్నాడో మీరే నిర్ణయించాలి.కానీ,నేననుకున్నట్లు మాత్రం పనికొచ్చాడు.పైకొచ్చాడు."ఎలా పైకొచ్చాడయ్యా?" అంటారు.నాగేశ్వరరావు ఇంత పైకి రావటానికి ఒక కుల వ్యవస్థ,ఒక నిర్మాణ సంస్థ,ఒక పంపిణీ కంపెనీ వెనక ఉన్నాయని కొందరంటూంటారు.




ఇంత పైకి రావటానికి ఒక కుల వ్యవస్థ,ఒక నిర్మాణ సంస్థ,ఒక పంపిణీ కంపెనీ వెనక ఉన్నాయని కొందరంటూంటారు.తన లోపాలు తనకు తెలుసు కనుక. తన తప్పులు తను తెలుసుకుంటాడు కనుక. నాగేశ్వరరావంటే అదృష్టం కాదు.అంగబలం కాదు,అర్థబలం కాదు.నాగేశ్వరరావు అంటే దీక్ష,కృషి,క్రమ శిక్షణ. నాగేశ్వరరావు నటుడుగా పుట్టలేదు.నటుడు కావాలనుకున్నాడు.శరీరాన్ని,మనసునూ,అలవాట్లనూ,అభిరుచులను,ఆశలనూ,ఆకర్షణలనూ,అదుపులో పెట్టుకుని,తన లక్ష్యానికి తగ్గట్టుగా మలుచుకుని తీర్చి దిద్దుకుని నటుడయ్యాడు.దీనికంతా ఆనాటి సినిమా పరిశ్రమ వాతావరణం కూడా సహాయపడింది.అంటే–తారాబల ప్రభావం ఇంత ప్రబలంగా లేని రోజులవి. దర్శకుడు,కెమెరామెన్,సౌండ్ రికార్డిస్ట్ మొదలగు సాంకేతికనిపుణులే అప్పుడు తారలు.వాళ్ళలో చాలా మంది విద్య,సంస్కారం కలవారు.
దక్షిణ దేశ చలన చిత్ర పరిశ్రమను ఒక లక్ష్యంగా,ఒక ఉద్యమంగా స్వీకరించినవాళ్ళు. అందువల్ల ప్రతిభను వెతకడం,తయారుచేయడం పరిశ్రమకు బలం చేకూర్చడం వాళ్ళ కర్తవ్యంగా ఉండేది.

**ఈ వాతావరణం అప్పుడుండబట్టే ఆ నాగేశ్వరరావు ఈ నాగేశ్వరరావు అయ్యాడు**

అవన్నీ ఇప్పుడు పూర్తిగా శూన్యం కాబట్టే మరో నాగేశ్వరరావు రాలేకపోతున్నాడు.
నాగేశ్వరరావు ఇంకా హీరోగా చెలామణి కావడం మనకు ఇబ్బంది లేదు కాని,మరి కొందరు నాగేశ్వరరావులు రాకపోవడం పరిశ్రమకు ఆరోగ్యకరం కాదు.

**నాగేశ్వరరావు గొప్ప నటుడంటారు.**
**కాదని నేనంటాను**

కారణం నాగేశ్వరరావును నటజీవితానికి పరిచయం చేసిన నాటక రంగాన్ని ఆయన వదలకుండా ఉంటే ఆయన నటన నిగ్గు తేలేది.అందుకు నిదర్శనం చాలా మంది తమిళ నటులే. నాగేశ్వరరావు ఇప్పటికి ఆరితేరింది సినిమా నటనలో మాత్రమే అని నా అభిప్రాయం.నటన గురించి ఆయనకు కొన్ని నిశ్చతాభిప్రాయాలు ఉన్నాయి. వాటితో నేనేకీభవించను.అందువల్ల నాగేశ్వరరావుకు నష్టముండదు..కాని ఆయన మళ్ళా నాటకరంగానికి రావడం అంటూ తటస్థపడితే నటన గురించి ఆయన నిశ్చితాభిప్రాయాలు మార్చుకుని నాతో ఏకీభవిస్తాడనీ,అందువల్ల చాలా లాభం ఉంటుందని నా ఆశ.ఈ సోదంతా ఎందుకంటారేమో...అభిమానముంది కనుక.నన్ను గురించి నాగేశ్వరరావును అడగండి ..ఎన్ని చెబుతాడో..అదీ అభిమానమే.మీకు తెలియంది ఇంకోటి చెబుతాను.నేనింతవరకూ మానవ మాత్రుడు మీద..అందులో సినిమా నటుడు మీద వ్రాయటం ఇదే మొదటిసారి.

**– అందుకే పొగడాలంటే పొగరడ్డమొస్తోంది.**
**తెగడాలంటే సత్యం అడ్డొస్తోంది**

అందుచేతే నాగేశ్వరరావు కృషిని ఎప్పుడూ కాదనను గొంగళి పురుగు సీతాకోక చిలుక కావడానికి పడే శ్రమ,పరిణామ అవస్థలూ పడ్డాడు నాగేశ్వరరావు.అందుకే నిలబడ్డాడు. అందుకే ఇప్పుడు వచ్చిన,ఇక రాబోయే నటులకూ,హీరోలకు ఆదర్శంగా ఉంటాడు.నాగేశ్వరరావు అందుకున్న శిఖరాలను చూచి అర్రులు చాచే వాళ్ళే కాని,చేసిన కృషినీ,పడ్డ శ్రమనూ బయిలుదేరే ముందు చేరుకోవాలనుకున్న లక్ష్యాన్నీ గుర్తించి అనుసరించేవాళు ఒక్కరూ లేరు.నాగేశ్వరరావు సినిమా పరిశ్రమకు డబ్బు సంపాదించాలని రాలేదు. ఇప్పటికీ ఆయన డబ్బుని సంపాదిస్తున్నా– డబ్బు ఆయన్ను సంపాదించడం లేదు. వ్యక్తిగా ఆయనకు జీవితంలో సంతృప్తి ఏర్పడింది. నటుడుగా ఆయనకింకా అసంతృప్తి ఉందని నాకు తెలుసు.అసంతృప్తిని వెతుకుతూనే ఇంకా వేషాలు వేస్తున్నాడు.అది దొరికే వరకూ హీరోగానే ఉంటాడు.దొరికిన నాడు నిజంగా హీరో అవుతాడు.నాగేశ్వరరావు మంచివాడంటారు. అంత మంచివాడేం కాదు. కాస్త చెడ్డవాడు కూడా అంటాను. సినిమా పరిశ్రమలో అందరూ అనుసరించలేని నీతులూ,నియమాలు కొన్ని ఉన్నాయి ఆయనకు.అవి అందరూ అనుసరించాలని ఆయన పట్టుదల అనుసరించలేని వాళ్ళకు చెడ్డవాడవుతుంటాడు.నా పేరు నాగేశ్వరరావు.నేను నాగు పాము లాంటి వాడ్ని అని ఒకప్పుడన్నాడట. నిజమే.ఆయన పగ పడతాడు.కానీ విషం కక్కడు.నాగేశ్వరరావు నిలకడ లేని మనిషి. అభిప్రాయాలు మార్చుకుంటూంటాడు.అవును.ఆ మార్చుకునేవి దురభిప్రాయాలే.

**–నాగేశ్వరరావు ఇంత పైకి రావటానికి ఒక కుల వ్యవస్థ,ఒక నిర్మాణ సంస్థ,ఒక పంపెణీ కంపెనీ వెనక ఉన్నాయని కొందరంటూంటారు.**

**నేనది సుతారామూ నమ్మను.ఒప్పుకోను.**
**ఆ నమ్మకంతో అలాంటి ఏర్పాట్లు చేసుకోవటానికి ఈ తరం వాళ్ళు ఎవరైనా ప్రయత్నిస్తే తప్పు దారిలో వెళుతున్నారని..అభివృద్ధి కన్నా అధోగతి పాలవుతారనీ హెచ్చరిస్తున్నాను**

నాగేశ్వరరావు సినిమా రంగంలో అడుగు పెట్టినప్పుడు అలాంటివేమీ లేవు.నిజం చెప్పాల్సి వస్తే ఆయన్ను ఆధారం చేసుకుని అవన్నీ బలం చేకూర్చుకున్నాయని అంటే తప్పులేదేమో.ఆయనకు సినిమారంగంలో మొదటి రంగు పూసింది కులం కాదు. ఆయన్ను ప్రప్రథమంగా క్లిష్టమైన ఉదాత్తమైన పాత్రలను పోషించగల నటుడుగా నిరూపించింది తన నిర్మాణ సంస్థ కాదు.


**నాగేశ్వరరావు తన్ను తానొక బంక మట్టిగా భావించుకున్నాడు.దాన్ని తానే మర్ధించాడు.మదించాడు**

**అందులో రాళ్ళూ రప్పలూ,నలుసులూ పొలుసులూ ఏరి పారేసుకున్నాడు.తనకొక రూపాన్ని నిర్ణయించుకొని,తీర్చి దిద్దుకున్నాడు.ఒక మూర్తిగా తయారయ్యాడు. మనం దాన్ని ఆదర్శమూర్తి అందాము.**

కృషీవలుడుగా పుట్టి కృషిలో ఉన్న ఖుషీని గుర్తించి,నిషాను ఆస్వాదించిన ఒక మధురమూర్తిగా తయారయ్యాడు.నాగేశ్వరావు ఈజ్ యీక్వల్ టు కృషి –ఈజ్ యీక్వల్ టు నాస్తి దుర్భిక్షం.
షరతు: ఈ వ్యాసం మొత్తంలో ప్రభుత్వం ఇచ్చిన బిరుదు వాడలేదు–వాడకూడదన్నారు కనుక.

**– 'డు' అన్నాను–నాకు చాలా ఆప్తు'డు' కనుక**

## ఇస్రో మాజీ ఛైర్మన్ కె.కస్తూరిరంగన్ కన్నుమూత.



**బెంగళూరు కరపత్రం ప్రతినిధి**

ఇస్రో మాజీ ఛైర్మన్ కె.కస్తూరిరంగన్ (84)కన్నుమూత.బెంగళూరులోని తన నివాసంలో ఉదయం తుదిశ్వాస.విడిచారు 1994 నుంచి 2003 వరకు ఇస్రో ఛైర్మన్?గా ఉన్న కస్తూరిరంగన్.లి పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన కస్తూరిరంగన్. 2020 జాతీయ విద్యావిధానం రూపకల్పన కమిటీ ఛైర్మన్?గా కస్తూరిరంగన్. జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ ఛాన్సలర్ పనిచేసిన కస్తూరిరంగన్. 2003–2009 మధ్య రాజ్యసభ సభ్యుడిగా ఉన్న కస్తూరిరంగన్. లిపద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ పురస్కారాలు అందుకున్న కస్తూరిరంగన్

## పాక్‌కు వత్తాసు పలికిన MLA అరెస్ట్.. దేశద్రోహం కేసు నమోదు



**అస్సాం స్టేట్ ఏప్రిల్ 25 కరపత్రం ప్రతినిధి**

పాక్‌కు వత్తాసు పలికిన MLA అరెస్ట్.. దేశద్రోహం కేసు నమోదు పహల్గాంలో ఉగ్రదాడిపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. అయితే, అస్సాంలోని మంకాచార్ నియోజకవర్గానికి చెందిన ఏఐయూడీఎఫ్ ఎమ్మెల్యే అమీనుల్ ఇస్లాం.. పహల్గాం ఘటనలో పాకిస్థాన్‌ను సమర్థిస్తున్నట్లు ఆరోపణలున్న ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ సీరియస్ అయ్యారు. సీఎం ఆదేశాలతో ఎమ్మెల్యేని అరెస్టు చేసి, దేశద్రోహం కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఉగ్రదాడి.. వినయ్ నర్వాల్ భార్యపై అసభ్యకర కామెంట్స్



**మధ్యప్రదేశ్ స్టేట్ కరపత్రం ప్రతినిధి**

ఉగ్రదాడి.. వినయ్ నర్వాల్ భార్యపై అసభ్యకర కామెంట్స్ జమ్మూకశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో ఉగ్రదాడి ఘటనలో మరణించిన నేవీ ఆఫీసర్ వినయ్ నర్వాల్‌ను చూసి భార్య రోదించిన తీరు కోట్లాడి మంది హృదయాలను కలచివేసింది. అయితే ఈ ఘటనపై మధ్యప్రదేశ్‌కు చెందిన ఒసాఫ్ ఖాన్ అసభ్యకర కామెంట్స్ చేశారు. 'వినయ్‌ని చంపించడానికి ఆయన భార్య ఓ షూటర్‌ను నియమించి ఉండవచ్చు. ముందు ఆమెను విచారించండి.' అని సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. దాంతో పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు...

# రక్తం పులుముకున్న కుంకుమ పువ్వు తిరగబడుతున్నది

గజెల్లి రాజేంద్ర ప్రసాద్, కోరుట్ల



ప్రముఖ రచయిత, నటుడు తనికెళ్ల భరణి ఎప్పుడో 40 ఏళ్ళ క్రితం రాసిన కవిత ఇది.ఇంకా తడిగానే ఉంది..హృదయాన్ని రగిలిస్తున్నది.కుంకం పువ్వు కాశ్మీరంలోనే కుంకం పువ్వెందుకు పూస్తుందో నాకర్థమైపోయింది ! అక్కడ ఉన్నట్టుండి పాకే పాకే పసిబిడ్డ నెత్తురు ముద్దై పోతుంది సామగానం చేసే కాశ్మీరీ పండితుల కంఠాల్లోంచి వేదం ఆగి - రుధిరం బైటికొస్తుంది అక్కడ రేపు పల్లకీ లెక్కి ఊరేగాల్సిన పెళ్ళికొడుకులు ఇవాళే పాడెక్కుతారు...ఆ లోయలో హిమాలయాలు సైతం మూర్తీభవించిన వైధవ్యాల్లా ఉంటాయ్ భరతమాత కిరీటం వొరుసుకునీ నిరంతరం అక్కడ నెత్తురోడుతూ ఉంటుంది ! బుద్ధుడు కూడా కళ్ళూ నోరూ మూసుకుని మళ్ళీ అంతర్ముఖుడౌతాడు !! పహల్గాం దురాగతం గురించి ఇంతకంటే ఎక్కువ ఏం చెప్పగలం."అహింసా పరమో ధర్మః ధర్మ హింసా తదైవచ"హింస చేయకపోవడం అత్యున్నత ధర్మం.అదే విధంగా ధర్మం కోసం హింస చేయడం కూడా ధర్మం.సమాజ ధర్మం.చట్టం ఆ పని చేస్తుంది,చెయ్యాలి

**దుర్మార్గుల నుండి సమాజాన్ని రక్షించడానికి హింస ఉపయోగించవచ్చు**

# శ్రమదానం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు,

**మొగుళ్లపల్లి ఏప్రిల్ 25 కరపత్రం ప్రతినిధి**





మొగుళ్లపల్లి మండలం మెట్టుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామంలో రైతుల సౌకర్యార్థం శ్రమదానం చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. మెట్టుపల్లి గ్రామం నుండి కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్లే దారిలో.. రోడ్డుకు ఇరువైపులా ముళ్ళ చెట్ల పొదలు ఏపుగా పెరిగి రాకపోకలకు ఇబ్బందిగా తయారయ్యాయి. కనీసం మనుషులు నడవలేని స్థితిలో రోడ్డు అద్వాన పరిస్థితిలో ఉండటంతో గీతా కార్మికులు రైతులు సామాన్య ప్రజలు ఆ బాట వైపు వెళ్లాలంటేనే ఇబ్బంది పడే పరిస్థితి నెలకొని ఉండేది ఇది గమనించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గజ్జి రాజకుమార్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ ఏకాంబర సుగుణ తుమ్మ చిరంజీవి జనగాం శ్రీనివాస్ పరిస్థితిని గమనించి జెసిబి సహాయంతో శ్రమదానం చేసి తాత్కాలిక రోడ్డు మరమ్మతులు చేసి గీత కార్మికులకు రైతులకు మేలు చేశారు. ఎవరో వస్తారని ఎదురు చూడకుండా గ్రామంలో ఉన్న సమస్యలను తమకు తామే పరిష్కరించుకుంటూ మెట్టుపల్లి కాంగ్రెస్ నాయకులు ఇతరులకు ఆదర్శంగా నిలిచారు శ్రమదానం చేసిన నాయకులను మెట్టిపల్లి గ్రామస్తులు అభినందించారు

# 25 వసంతాల గులాబీ పండుగను విజయవంతం చేయండి

- కుంభమేళ తరహాలో బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ
- కేసీఆర్ పాలనను యావత్తూ తెలంగాణ ప్రజలు కోరుతున్నారు
- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**



వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27 వ తేదిన జరిగే 25 వసంతాల గులాబీ పండుగను విజయవంతం చేయాలని గులాబీ జెండాను గుండెకు హత్తుకుందామని, ఊరు వాడా ఉప్పెనలా కదిలి ఓరుగల్లు మహా సభను విజయవంతం చేద్దామని రామగుండం మాజీ శాసనసభ్యులు, పెద్దపల్లి జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. సభను విజయవంతం చేయాలని కోరారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే, టిఆర్ఎస్ పార్టీ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్క్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 24 ఏళ్ల బిఆర్ఎస్ పార్టీ ప్రస్థానాన్ని రజతోత్సవ సభలో చర్చించడం జరుగుతుందని,కనీవినీ ఎరుగని రీతిలో పండగ వాతావరణంలో కుంభమేళా తరహాలో కెసిఆర్ నాయకత్వంలో బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రామగుండం నియోజకవర్గం నుంచి ఐదు వేల మంది ఈ సభకు తరలి వెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్న సమయంలో బషీర్బాగ్లో రైతుల మృతికి నిరసనగా ఆనాడు డిప్యూటీ స్పీకర్ గా ఉన్న కెసిఆర్ తన పదవికి రాజీనామా చేసి పార్టీ ని స్థాపించి 14 ఎళ్ల అలుపెరని పోరాటం చేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారన్నారు. పదేళ్ల కెసిఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దేశానికి నెంబర్ వన్ గా నిలిచింది అని ప్రతి ఇంటికి సంక్షేమం అందించిన ఘనత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కి దక్కుతుందన్నారు. కెసిఆర్ పాలనలో వృద్ధులకు 2000 పెన్షన్ కళ్యాణ లక్ష్మి, మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన త్రాగు నీరు, కాలేశ్వరం ప్రాజెక్టు ఏర్పాటు చేసి తెలంగాణ రాష్ట వ్యవసాయ రంగాన్ని సస్యశామలం చేశారని, రైతులకు 24 గంటలు ఉచితంగా కరెంటు, సాగునీరు సకాలంలో ఎరువులు పెట్టుబడి సహాయం అందించిన మనసున్న మరాజు కేసీఆర్ అన్నారు.పదేళ్ల ప్రగతి ప్రస్థానం వెనక్కి పోయిందని, తెలంగాణ ప్రజలు దిగాలు పడుతున్నారని, కెసిఆర్ మళ్లీ సీఎం కావాలని తెలంగాణ ప్రజలంతా కోరుతున్నట్టు ఆయన తెలిపారు. రామగుండం నియోజకవర్గం నుంచి స్వచ్ఛందంగా బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు, బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు తరలి వెళ్ళేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పారు. ఈ విలేఖరుల సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు నడిపెల్లి మురళీధర్ రావు, గోపు అయిలయ్య యాదవ్, బోడ్డు రవీందర్, కుమ్మరి శ్రీనివాస్, కలవచర్ల కృష్ణవేణి, బొడ్డుపల్లి శ్రీనివాస్, జనగామ కవితా సరోజిని, తోట వేణు,చెలకలపెల్లి శ్రీనివాస్, అచ్చ వేణు, నూతి తిరుపతి, ఇరుగురాళ్ల శ్రావణ్, అవునూరి వెంకటేష్, జక్కుల తిరుపతి, తిమోతి, కిరన్ జీ, బచ్చాల రాములు, కోడి రామకృష్ణ, కర్రీ, ఓదేలు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో అన్యువల్ డే



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

రామగుండం నగరపాలక సంస్థ 38వ డివిజన్లో ఇంద్రానగర్ వన్ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం అన్యువల్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంగన్వాడి పిల్లల అభివృద్ధినీ అబ్జర్వేషన్ చేసి సూచికలను అభివృద్ధి కార్డులో స్టార్ల రూపకంగా సూచించి.. తల్లిదండ్రులకు ప్రతి ఒక్కల పిల్లల తల్లిదండ్రులకు తమ పిల్లల అభివృద్ధిని చెప్పి ప్రోగ్రెస్ కార్డ్ అందించడం జరిగింది. అలాగే అంగన్వాడి కేంద్రం మీద నమ్మకంతో అంగన్వాడీ కేంద్రానికి వాళ్ల పిల్లలని జాయిన్ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పిల్లలు అంగన్వాడీ కేంద్రంలో నేర్చుకున్న ఆటలు పాటలు నృత్యం చేశారు. పిల్లల తల్లిదండ్రులు కూడా ఉత్సాహంగా నృత్యంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా గ్రూప్ అధ్యక్షురాలు కొమురమ్మ, అంగన్వాడీ టీచర్ రజిత, ఆయా అరుణ, పిల్లల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజా ఫ్రంట్ కరీంనగర్ జిల్లా కమిటీ సమావేశం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 25**





జమ్మికుంట పట్టణంలోని విస్ డమ్ కాలేజీలో 25-4-2025 రోజున నిర్వహించిన కరీంనగర్ జిల్లా తెలంగాణ ప్రజా ఫ్రంట్ 4వ జిల్లా కమిటీ సమావేశాలు జరిగాయి. ఈ జిల్లా కమిటీ సమావేశంకు వచ్చిన రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం రాష్ట్ర కో కన్వీనర్ గొల్లూరు ప్రవీణ్ కుమార్ లు హాజరైనారు. రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం మాట్లాడుతూ ప్రజాస్వామ్య తెలంగాణ (టీపీఎఫ్) ప్రధాన లక్ష్యం అన్నారు. కరీంనగర్ జిల్లాలోని కనిజ సంపదను ఖరీదైన గుట్టల విధ్వంసం యదేచ్చగా జరుగుతుంది. ఇంత బహిరంగంగా జరుగుతున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోక పోవడం చాలా బాధాకరం అని అన్నారు ఈ విధంశాన్ని తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకొని ఆపివేయాలి ఇసుక క్వారీలను తక్షణమే ఆపివేయాలి. ఆపరేషన్ కు వ్యతిరేకంగా ఆదివాసీలపై జరుగుతున్న హత్యలను అమాయకులైన ఆదివాసులను హత్యలు చేయడం కేంద్ర రాష్ట్ర పారా మిల్టీ డి.ఆర్.జి బలగాలను నిలిపివేయాలి తదితరు లక్షలాది మిలిటరీ బలగాలను వెంటనే వెనక్కి రప్పించాలి బోగస్ ఎన్కౌంటర్ లను తక్షణమే ఆపివేయాలి భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి రాజ్యాంగాన్ని కాపాడాలి ఆదివాసుల హక్కుల మరణాన్ని వెంటనే ఆపేయాలి మావోయిస్టులతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్చలు జరపాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి హాజరైన వివిధ ప్రజా సంఘాల నాయకులు తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి కొత్తూరు ఇంద్రసేన పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి గడ్డం సంజీవ్ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి పాపన్న గౌడ్ హాజరయ్యారు. ఈ సమావేశంలో కరీంనగర్ జిల్లా (టీ పి ఎఫ్) నూతన కమిటీని ఎన్నిక చేశారు. అధ్యక్షులుగా ఆరెల్లి మల్ల గౌడ్ ప్రధాన కార్యదర్శిగా ఆయిందాల అంజన్న ఉపాధ్యక్షులుగా అలుగువెల్లి మల్లారెడ్డి కార్యవర్గ సభ్యులు గా చేరాలు సహాయ కార్యదర్శి చుక్కల శ్రీనివాస్ దేవునూరి రవి లను ఎన్నుకున్నారు.

# ప్రెస్ క్లబ్ అధ్యక్షుడుని పరమర్శించి మాజీ ఎమ్మెల్యే చందర్



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

బైక్ అదుపుతప్పి పడి గాయపడిన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పూదరి కుమార్ ను శుక్రవారం రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పరమర్శించారు. కుమార్ ఆరోగ్య పరిస్థితి ని అడిగి తెలుసుకున్నారు. కుమార్ త్వరగా కోలుకోవాలని అకాంక్షించారు. మాజీ ఎమ్మెల్యే వెంట నాయకులు కుమ్మరి శ్రీనివాస్, నారాయణదాసు మారుతి ఉన్నారు.

# వడదెబ్బతో జీప్ డ్రైవర్ వెంకన్న మృతి..

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 25**








జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో నివాసముంటున్న వోల్లాల వెంకన్న కొంతకాలంగా అనారోగ్యముతో బాధపడుతూ ఇంటి వద్దనే ఉంటున్న తరుణంలో మండుటెండలు ఎక్కువ అవడంతో వడదెబ్బకు గురై శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందారు.అతనికి భార్య ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ యజమాని అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబం అంధకారంలో చేరింది.ఆరోగ్యంగా కోలుకుంటున్న తరుణంలో వడదెబ్బతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు బంధువులు శోకసముద్రంలో మునిగిపోయారు.నిరుపేద అయిన డ్రైవర్ వెంకటేశ్వర్లు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# మృతుని కుటుంబానికి బియ్యం అందజేత

**కరపత్రం ప్రతినిధి-హుజురాబాద్:**



రైస్ మిల్ కార్మికునిగా పనిచేస్తున్న బోర్నపల్లి గ్రామానికి చెందిన కొలుగురి కుమార్ స్వామి ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబానికి తోటి కార్మికులు 150 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైస్మిల్ ఆపరేటర్ల యూనియన్ మండల అధ్యక్షుడు ప్రతాప శ్రీనివాస్ మాట్లాడుతూ... మిల్లులో పనిచేస్తున్న కార్మికులకు తాము అండగా ఉంటామని తెలిపారు. ఆపద సమయాల్లో తమ శక్తి మేరకు తోచినందుకు సహాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్ ఆపరేటర్ల యూనియన్ మండల అధ్యక్షుడు ప్రతాప శ్రీనివాస్, కోశాధికారి సారంగపాణి, సభ్యులు సాంబయ్య, రాజు, సత్యం, రవి, సంపత్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.